క్లుప్తంగా

మలుపు.. ప్రమాదానికి పిలుపు



పెంజర్లలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

కొత్తూరు: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లలో ఉన్న మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పెంజర్ల నుంచి సిద్ధాపూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో పెంజర్ల జెడ్పీహెచ్‌ఎస్ ఎదురుగా ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

కొత్తూరు: మండలంలోని పలు పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు పనిచేసే చోట వారికి కనీస రక్షణ పరికరాలు సమకూర్చని కారణంగా చిన్న ప్రమాదాలు చోటు చేసుకున్నా వారు తీవ్రంగా గాయపడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు కూడా సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు రావడం నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారే తప్పా మరోమారు ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు రక్షణ పరికరాలను సమకూర్చని పరిశ్రమల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాశన్నకుంటకు మరమ్మతులు చేపట్టాలి

కొత్తూరు: పట్టణ సమీపంలో ఉన్న కాశన్నకుంట చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలని మత్స్యకార సంఘం సభ్యులు కోరారు. కొన్నేళ్ల నుంచి మరమ్మతులు లేని కారణంగా చెరువులో పూడిక, కంపచెట్లు పెరిగి నీటి నిల్వ సామర్థ్యం చాలా వరకు తగ్గిపోయిందన్నారు. దానికి తోడు చెరువు కట్టకు పలుచోట్ల లీకేజీలు ఉన్నట్లు తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే చెరువుకట్ట తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించి కట్టకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



గోడలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 140 డబుల్ బెడ్రూం ఇళ్ల పక్కన ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కబ్జా చేసి ప్రీకాస్ట్ గోడను నిర్మించారు. ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, పోలీసుల సహాయంతో జేసీబీలతో అక్రమ నిర్మాణాలను తొలగింపజేశారు. అనంతరం ఆర్డీఓ సూరజ్ కుమార్ మాట్లాడుతూ.. మన్సాన్‌పల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 140లోని భూమి మొత్తం ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎంతటివారికైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలానికి చెందిన కొందరు చేసిన ఫిర్యాదు మేరకు తాము అప్రమత్తమయ్యామన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి రక్షణకు కంచె ఏర్పాటు చేసి బోర్డులు పాతిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బందితో గట్టి నిఘా ఏర్పాటు చేసి భూములను కాపాడుతామని పేర్కొన్నారు. ఇక నుంచి ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం

బడంగ్‌పేట్: క్రీడలతో ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్)టోర్నమెంట్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. నేటి సమాజంలో యువకులు దారి తప్పకుండా క్రీడలు, ఇతర ఆటలపై దృష్టి పెట్టడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రోటోకాల్ కార్యదర్శి బాబు, స్థానికులు పురుషోత్తంరెడ్డి, సుభాన్‌యాదవ్, సుభాష్‌రెడ్డి, విజయ్, హరి, అనీల్, రజని, హరీశ్ పాల్గొన్నారు.

పని చేసినా పైసలేవీ?

- ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- ఎండలోనే పనులు.. నిలిచిపోయిన సౌకర్యాలు
- వసతులు కల్పించాలని విజ్ఞప్తి



బొబ్బిలిగ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

షాబాద్: గ్రామాల్లో వలసల నివారణకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. పనులు చేసే చోట సదుపాయాలు దేవుడెరుగు.. ఉపాధి కూలీలకు వేతనాలు కూడా అందడం లేదు. ఏటా వేసవిలో అందించే అదనపు అలవెన్స్‌లు సైతం నిలిపివేశారు. అదేవిధంగా ఎండలు మండుతుండడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశంలో సేద దీరేందుకు టెంట్లు కూడా ఏర్పాటు చేయలేదు. తాగునీరు సౌకర్యం కల్పించడం లేదు. కూలీలు వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం 14 రోజుల్లో చేసిన పనులకు కూలీ చెల్లించాల్సి ఉంది. కానీ మూడు నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో అర్ధాకలితో పనులు చేయలేమని కూలీలు వాపోతున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు పనులకు వచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు. ఉపాధి పనులకు రండి అని ఈజీఎస్ అధికారులు బతిమిలాడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

8,500 మందికి జాబ్‌కార్డులు..

మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో మొత్తం 8,500 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇప్పటివరకు 700 మంది కూలీలు ఉపాధి పనులను ఉపయోగించుకుంటున్నారు. కాగా మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి కూలీలకు కొన్నేళ్లుగా మెడికల్ కిట్లు అందడం లేదు. పారలు, గడ్డపారలు కొన్నేళ్ల క్రితం పంపించినా అవి కూడా నిలిపివేశారు. నాలుగైదు ఏళ్లుగా భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం బోరుబావుల్లో భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయ పనులు కూడా తగ్గాయి. అయినా కూలీలు సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదని ఉపాధి పనులకు రావడానికి ఆస్తకి చూపడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు దినసరి కూలీ రూ.272 నిర్ణయించింది. మండలంలో పలు గ్రామాల్లో వందలాది మంది కూలీలు ఉన్నా ఉపాధి పనులకు వచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు.

సకాలంలో అందేలా చూస్తాం



గ్రామాల్లో ఉపాధి కూలీలకు సరిపడా పనులు గుర్తించాము. పనులకు రావాలని కూలీలను అడుగుతున్నాం. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని ప్రస్తుతం మండలంలో 700 మంది కూలీలే పనులకు వస్తున్నారు. మరో వారంలో రెండు, మూడు వందల మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చే అవకాశం ఉంది. పెండింగ్ బిల్లులు సకాలంలో అందేలా కృషి చేస్తాం. – వీరాసింగ్, ఏపీఓ, షాబాద్

వేతనాలు అందడం లేదు



పనులు చేస్తున్నా తమకు వేతనాలు సరైన సమయంలో చెల్లించడం లేదు. జనవరిలో ఉపాధి పనులకు వెళ్లాం. కానీ ఇప్పటివరకు ఆ పనులకు సంబంధించిన వేతనాలు రాలేదు. ఇంట్లో ఖర్చులు, ఇతర అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నాం. – నర్సింహులు, కూలీ, బొబ్బిలిగామ

వైద్య సదుపాయాలు కల్పించాలి



ప్రస్తుతం వేసవి ప్రారంభమైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనులు చేస్తున్నాం. కూలీలు వడదెబ్బకు గురైతే వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో లేవు. గ్రామాల్లో పనిచేస్తున్న ఆశకార్యకర్తలు వచ్చి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇచ్చి వెళ్తున్నారు. – నీలమ్మ, కూలీ, బొబ్బిలిగామ

కనీస వసతులు కల్పించాలి



ఉపాధి హామీ పనులు జరుగుతున్న స్థలాల్లో కూలీలకు కనీస సరైన వసతులు లేవు. గ్రామంలో కోపుల పనులు చేస్తున్నాం. ఇంతకు ముందు నీడ కోసం కవర్లు ఏర్పాటు చేసేవారు. పల్లెల్లో ఉదయం 7 గంటలకే పనులకు వెళ్లి 11:30 గంటలకు ఇంటికి చేరుతున్నాం. –జంగయ్య, కూలీ, బొబ్బిలిగామ

పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయిస్తున్న కార్యదర్శి సంధ్యారాణి

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ గ్రామంలో 'రోడ్డంతా జలమయం' అనే శీర్షికతో ప్రచురితమైన సాక్షి కథనానికి పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేసి పైపులైన్ లీకేజీని అరికట్టారు. ఆదివారం హిమాయత్‌నగర్ 1వ వార్డులో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి సిబ్బందితో కలిసి పైపులైన్ లీకేజీని పరిశీలించి మరమ్మతులు చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ వేసవి కాలంలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. ఏ సమస్యలు ఉన్నా ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పైపులైన్ లీకేజీ సమస్యపై పత్రిక ద్వారా తెలపడంతో అధికారులు స్పందించడం అభినందనీయమని గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు బిస నర్సింహ్మముదిరాజ్, ఆశోక్‌ముదిరాజ్, మహేశ్‌ముదిరాజ్ పేర్కొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్: తెలంగాణ విమోచనం కోసం అసువులు బాసిన వీరుల త్యాగాలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రామకృష్ణ థియేటర్‌లో రజాకర్ సినిమాను బీజేపీ నేతలు వీక్షించారు. శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు విలేకరులతో మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు మహనీయులు ఎంతో పోరాటం చేశారన్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అందరు సంబరాలు జరుపుకుంటుంటే రాష్ట్రంలో రజాకార్ల పాలన కొనసాగించారన్నారు. చాకలి ఐలమ్మ, షేక్ బందగి, రామ్‌చందర్ లాంటి పోరాటయోధులు రజాకార్లను ఎదురించారన్నారు. ఆనాటి ఘటనలను నేటితరం వారికి రజాకార్ సినిమాలో కళ్లకు కట్టినట్లుగా చూపించారని తెలిపారు. గత పాలకులు ఓట్ల రాజకీయాల కోసం చరిత్రను వక్రీకరించారన్నారు. రజాకార్లు చేసిన దౌర్జన్యాలు, దాడులను నేటితరం ప్రజలకు తెలియనీయకుండా కుట్రలు పన్నారన్నారు. ప్రతి ఒక్క హిందువు రజాకార్ సినిమా చూడాలన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకోవాలని ప్రధాని మోదీ ప్రకటించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, కమ్మరి భూపాలాచారి, దేపల్లి అశోక్‌గౌడ్, వంశీకృష్ణ, చెట్ల వెంకటేష్, మల్చలం మురళీ, మోటె శ్రీనివాస్, నందిగామ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా గోపాల్‌రెడ్డి



గోపాల్‌రెడ్డికి నియామకపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా పీసరి గోపాల్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా చేవెళ్ల మండలంలోని పలుగుట్ట గ్రామానికి చెందిన పీసరి గోపాల్‌రెడ్డికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసిన జిల్లా కమిటీ సభ్యులకు, బీజేపీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు అందించే విధంగా పనిచేస్తానని చెప్పారు. రైతుల సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేలా సహకరిస్తామన్నారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకునేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మళ్లీ మోదీనే అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కిసాన్ మోర్చా పనిచేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోర నర్సింహ్మారెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పాండు రంగారెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఉమా శంకర్‌రెడ్డి, ఉపాధ్యాక్షుడు కేశపల్లి వెంకట్‌రాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్



పార్టీలో చేరిన వారితో భీంభరత్ తదితరులు

షాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో చేవేళ్లలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ గుట్టుపల్లి ఎల్లేశ్, సునిగంటి రమేశ్‌తో పాటు కొంతమంది చేవెళ్ల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మాజీ సర్పంచ్‌లు బర్ల యాదయ్య, తమ్మలి రవీందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం అందలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలను అందజేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నియంత పాలన పోయి బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం వచ్చిందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, జంగయ్య, రవి, మల్లేశ్, శివకుమార్, యాదయ్య, లక్ష్మయ్య, కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీను, మహేందర్, నరేందర్, సంజీవ, దినేశ్, నర్సింలు, విజయ్, కుమార్, సురేశ్, వెంకటేశ్, సిద్దేశ్వర్, సుభానయ్య తదితరులున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలా మంది నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో అఖండ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్ ఆధ్వర్యంలో సుమారు వందమంది బీఆర్‌ఎస్ నేతలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి నెరవేస్తున్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. బీజేపీ ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌నాయక్



పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

షాద్‌నగర్: కరాటే, కుంగ్‌ఫూ లాంటి యుద్ధ విద్యలు ఆత్మరక్షణకు ఎంతో దోహదడతాయని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బృందావన్ కాలనీలో న్యూ మాంక్స్ కుంగ్ ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో యుద్ధ విద్యలు నేర్చుకోవడం అంతే ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మరక్షణ కోసం విధిగా కరాటే, కుంగ్‌ఫూ లాంటి యుద్ధ విద్యలను అభ్యసించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు యుద్ధ విద్యల్లో విధిగా శిక్షణ ఇప్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ మాస్టర్ నక్క బాల్‌రాజ్, కౌన్సిలర్ లతాశ్రీశైలంగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి స్థిర ప్రతిష్ఠాపనోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



కంఠమహేశ్వరస్వామి ఆలయం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సురమాంబ సమేత కంఠ మహేశ్వరస్వామి ఆలయాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావడంతో సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు విగ్రహ, స్థిర ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సూరమాంబ సమేత కంఠ మహేశ్వర శివలింగం, గణపతి, పార్వతి, ఎల్లమ్మ, మైసమ్మ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. శివపార్వతుల కల్యాణం, బోనాలు, యజ్ఞ యాగాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశామని నిర్వాహకులు తెలిపారు.

పూజా కార్యక్రమాలు ఇలా..

సోమవారం మహాగణపతి పూజ, పుణ్యాహవాచన, గౌడ భక్తులకు విభూది పంచమహారుద్రాక్ష మాలాధారణ, గణపతి పూజ, దీపారాధన ప్రతిష్ఠ ప్రారంభం. 26న గోపూజనము, అగ్రోదకము, గణపతిపూజ, అగ్ని ప్రతిష్ఠాపనము దీక్ష హోమము, లక్ష్మిగణపతి హోమం, నవగ్రహ హోమం తదితర కార్యక్రమాల నిర్వహణ. శివలింగ, గణపతి, పార్వతి, ఎల్లమ్మ, మైసమ్మ ప్రతిష్ఠాపన విగ్రహాల ఊరేగింపు, జలాధివాసం. 27న హోమం, మంగళహారతి తీర్థప్రసాద వితరణ. 28న ఆలయంలో వేదపండితులు వేదోచ్ఛరణ మధ్య విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, హోమం. 29న సాయంత్రం భక్త సురమాంబ నాటక ప్రదర్శన. 30న గ్రామ దేవతలకు పూజలు, అష్టదిగ్బంధన, బంధువులచే ఒడి బియ్యం, బోనాలు, రాత్రి శివపార్వతుల కల్యాణం. 31న ఘటం పూజ, మొకు ముస్తాదులకు పూజ, గౌడ భక్తుల మాల విరమణతో ఉత్సవాలు ముగింపు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

కొందుర్గు: దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. ఆదివారం చౌదరిగూడ ఆర్య సమాజంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోయ కుర్మయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అరుణమ్మను ఎంపీగా గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. దేశ అభివృద్ధి మోదీతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా అనిల్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోనేరు శ్రీనివాసు, నాయకులు యాదయ్య, రాజు, అంజి, భీమయ్య, లింగం, వెంకటేశ్, సాయి, రామ్‌లక్ష్మణ్, కృష్ణయ్య, యాదగిరి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నీటి సరఫరాలో వ్యత్యాసం

- రోడ్డెక్కిన ఆలూరు గ్రామస్తులు
- గ్రామంలో పర్యటించిన అధికారులు



ఆందోళన చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు



అధికారులు ఏర్పాటు చేసిన ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

చేవెళ్ల: మండల పరిధిలోని ఆలూరు ఎస్సీ కాలనీవాసులు నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని ఆదివారం రోడ్డెక్కారు. మిషన్ భగీరథ సరఫరాలో హెచ్చుతగ్గులున్నాయని.. కాలనీలో ముందున్న ఇళ్లకు ఎక్కువగా సరఫరా అవుతున్నాయని తమకు సరిపడా నీరు అందడం లేదని ప్రధాన రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా అధికారులకు, అప్పటి ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు గ్రామానికి చేరుకొని వారికి సర్ది జెప్పారు. తాత్కాలికంగా ట్యాంకర్ ఏర్పాటు చేశారు.

కనెక్షన్ తేడాలతో ఇబ్బందులు: ఎంపీడీఓ హిమబిందు

ఎంపీడీఓ హిమబిందు, మిషన్ భగీరథ ఏఈ గ్రీతా స్రవంతితో కలిసి గ్రామంలో పర్యటించారు. కనెక్షన్ ఇచ్చే సమయంలో అందరికీ సమానంగా నీటి సరఫరా కోసం సిస్టం (షెరా) ఉంటుందని.. కొందరు ఇందుకు విరుద్ధంగా కనెక్షన్‌లు తీసుకోవడంతో సమస్య తలెత్తిందన్నారు. షెరా సిస్టం తొలగించిన కనెక్షన్‌లను గుర్తించి పునరుద్ధరిస్తున్నామన్నారు. మరికొందరు మోటార్లు ఏర్పాటు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.